క్లుప్తంగా

హౌసింగ్ డే నిర్వహించిన అధికారులు

రాయవరం: మండలంలోని మాచవరం, చెల్లూరు గ్రామాల్లో శనివారం ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి, హౌసింగ్ ఏఈ కొవ్వూరి శ్రీనివాసరెడ్డి హౌసింగ్ డే నిర్వహించారు. ఇందులో భాగంగా వారు హౌసింగ్ లే అవుట్లను సందర్శించారు. మాచవరం జగనన్న లే అవుట్‌లో 215 గృహాలు మంజూరు కాగా, వాటిలో 165 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మిగిలిన ఇళ్లను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో నరేంద్రరెడ్డి సూచించారు. చెల్లూరు లే అవుట్‌లో 869 గృహాలు మంజూరవగా, 517 గృహాలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. లబ్ధిదారులు నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో నరేంద్రరెడ్డి సూచించారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తున్నాయన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టరు ప్రసాదరావు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశునికి పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీవైభవ వేంకటేశ్వర స్వామివారికి శనివారం విశేష పూజలు చేశారు. గ్రామంతో పాటు పడమర ఖండ్రిక, కోరుమిల్లి, తాతపూడి, కపిలేశ్వరపురం, వెదురుమూడి గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు బాలబాలాజీ ఆధ్వర్యంలోని పండితులు స్వామిని విశేషంగా అలంకరించారు. దూరపు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాదాన్ని వడ్డించారు.

మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

రామచంద్రపురం రూరల్: యానం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ అదనపు ఎస్సై ఎస్.భుజంగరావు శనివారం విలేకరులకు తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన సారిక శ్రీనివాసరావు, పలపల సుబ్రహ్మణ్యంలు ద్విచక్ర వాహనంపై రూ.995 విలువైన 8 మద్యం సీసాలు తరలిస్తుండగా ద్రాక్షారామలో చేసిన తనిఖీల్లో పట్టుబడ్డారని ఎస్సై తెలిపారు.

మూతపడిన ఎస్‌బీఐ ఖాతాదారుల సేవాకేంద్రాలు

డ్వాక్రా మహిళలు, వినియోగదారుల ఇక్కట్లు



గొల్లపాలెంలో మూతపడిన ఎస్‌బీఐ ఖాతాదారుల సేవాకేంద్రం

కాజులూరు: గొల్లపాలెంలో ఎస్‌బీఐ కస్టమర్ సర్వీస్ ప్వాయింట్స్ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారుల సేవాకేంద్రాలు) గత కొన్ని రోజులుగా మూతపడి ఉండటంతో వినియోగదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. మండలంలో ప్రముఖ వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న గొల్లపాలెంలోని స్టేట్ బ్యాంక్‌లో ఖాతాదారుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. పరిసర గ్రామాల్లోని 15 గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళల బ్యాంక్ ఖాతాలు ఈ స్టేట్ బ్యాంక్‌లోనే ఉన్నాయి. దీంతో బ్యాంక్‌కు రద్దీ ఎక్కువవటంతో గత కొన్నేళ్ల క్రితం బ్యాంక్ అధికారులు మెయిన్‌రోడ్‌లో ఒక ఎస్‌బీఐ ఖాతాదారుల సేవాకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రూ.20 వేలు తక్కువ కన్నా నగదు చెల్లింపులు చేసుకునేవారు ఈ ఖాతాదారుల సేవాకేంద్రంలో చెల్లింపులు చేసుకోవచ్చు. కాలక్రమేణా ఖాతాదారుల సేవాకేంద్రానికి రద్దీ పెరగటంతో బ్యాంక్ అధికారులు మెయిన్‌రోడ్‌లోనే మరో ఖాతాదారుల సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం పనిదినాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఈ సేవాకేంద్రాలు వినియోగదారులకు అందుబాటులో ఉండేవి. డ్వాక్రా మహిళలు నెలనెలా లోన్, పొదుపు చెల్లింపులు చేసుకోవటంతో పాటు చిరు వ్యాపారులు ఈ సేవా కేంద్రాలను ఉపయోగించుకునేవారు. అయితే ఏడాది క్రితం సాంకేతిక లోపాలతో మొదట ఏర్పాటు చేసిన సేవాకేంద్రం మూతపడగా గత నెల రోజుల క్రితం రెండో సేవాకేంద్రాన్ని నిర్వాహకులు మూసివేశారు. దీంతో డ్వాక్రా మహిళలు, చిరు వ్యాపారులు మరలా స్టేట్‌బ్యాంక్‌కు పరుగులు తీయాల్సి వస్తుంది. అయితే బ్యాంకులో రద్దీ పెరగడంతో సిబ్బంది చిన్న మొత్తాలను చెల్లించే వినియోగదారులను పట్టించుకోవటం లేదని బాధితులు వాపోతున్నారు. డ్వాక్రా మహిళలు ఓచర్లు రాయించుకుని క్యూలో నిలబడి కౌంటర్ వరకూ వెళుతుంటే, ఓచర్లు కాదు ఏటీఎం కార్డులు తీసుకువస్తే స్వైపింగ్ చేసి డబ్బులు తీసుకుంటామని సిబ్బంది వెనుకకు పంపేస్తున్నారని మరోసారి ఏటీఎం కార్డులతో వెళుతుంటే స్వైపింగ్ మెషీన్ పనిచేయడం లేదని పక్క గ్రామాలకు వెళ్లి అక్కడ వినియోగదారుల సేవాకేంద్రాల్లో సొమ్ములు చెల్లించుకోవాలని చెబుతున్నారని మహిళలు వాపోతున్నారు. దీనిపై సంబంధిత బ్రాంచ్ మేనేజర్‌ను వివరణ కోరగా మరో 15 రోజుల్లో వినియోగదారుల సేవాకేంద్రాలు తెరుస్తామన్నారు. అప్పటి వరకూ బ్యాంక్‌లోనే చిన్న మొత్తాలను చెల్లింపులు చేసుకోవాలని సిబ్బందికి సూచించామన్నారు.

మండపేటలో ఎమ్మెల్సీ తోట స్థిర నివాసం

కుటుంబ సభ్యులతో కలిసి గృహప్రవేశం



గృహప్రవేశం సందర్భంగా ఎమ్మెల్సీ తోట దంపతుల పూజలు చిత్రంలో చైర్‌పర్సన్ దుర్గారాణి, పృథ్వీరాజ్

మండపేట: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మండపేటలోనే మకాం ఉండేలా స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. నియోజకవర్గ ప్రజలకు నిరంతర అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో ఇప్పటికే పట్టణంలోని పార్టీ కార్యాలయం పక్కనే గల అపార్ట్‌మెంట్‌లో ఫ్లాటును కొనుగోలు చేశారు. సతీమణి సూర్యకుమారి, కుమారుడు పృథ్వీరాజ్, కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఆయన గృహప్రవేశం చేశారు. స్వగ్రామం రామచంద్రపురం నియోజకవర్గంలోని వెంకటాయపాలెం అయినప్పటికీ మండపేట నియోజకవర్గ బాధ్యతలు చేపట్టిన తర్వాత పట్టణంలోని విజయలక్ష్మి నగర్‌లో నియోజకవర్గ స్థాయి కార్యాలయంతో పాటు మూడు మండల కేంద్రాల్లోను పార్టీ కార్యాలయాలు తెరిచి ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ఇప్పుడు ఎమ్మెల్సీ తోట మండపేటలోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడం పార్టీ శ్రేణులకు ఫుల్ జోష్ తెచ్చింది. తాజాగా పట్టణంలోని సొంత ఫ్లాట్‌లోకి గృహప్రవేశం చేశారు. అనంతరం సత్యనారాయణమూర్తి వ్రతం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి తదితరులు హాజరయ్యారు.

సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కపిలేశ్వరపురం: జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణం నిమిత్తం ప్రభుత్వం చేసే సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. హౌసింగ్ ఏఈ పీవీవీఎస్ఎస్‌మూర్తి, కార్యదర్శి చినబాబు, సచివాలయ ఉద్యోగులతో కలిసి మాచర గ్రామంలోని లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఇల్లు నిర్మాణానికి సిద్ధపడినవారికి ప్రభుత్వం చేసే సాయాన్ని హౌసింగ్ ఏఈ పీవీవీఎస్ఎస్ మూర్తి వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి చినబాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామ క్షేత్రం వార్షికోత్సవం



స్వామివారి కల్యాణ వేడుకలో ఆలయ కమిటీ సభ్యులు

మండపేట: పట్టణంలోని బురగుంట చెరువు వద్ద గల సీతారామ క్షేత్రం 6వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ మల్లిపూడి గణేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ క్షేత్రంలోని మహాగణపతి, మహాలక్ష్మి దేవి, హనుమత్ సీతారామ లక్ష్మణులు, సాయినాథ్ స్వామివార్లకు తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ స్వామివార్ల గ్రామోత్సవం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం సాయినాథునికి అఖండ సంధ్యా హారతి అనంతరం రాత్రికి సీతారామ, లక్ష్మీ శ్రీనివాసుల తిరుకల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు వేగుళ్ల పుష్పరాజు, కొనగళ్ల సత్యనారాయణ, మల్లిపూడి వెంకటేశ్వరరావు, పసల శ్రీనివాస్, వల్లూరి కృష్ణయ్య పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో విరాట పర్వం ప్రవచనాలు



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో విరాట పర్వం ప్రవచనాలు చెబుతున్న భరణి రాజ్‌కుమార్‌శర్మ

రామచంద్రపురం రూరల్: లోక సంరక్షణార్థం, రైతులు సుభిక్షంగా ఉండాలని వేసవి తాపం తగ్గి సకాలంలో వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్న సంకల్పంతో ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో శనివారం మహాభారతంలోని విరాట పర్వం ప్రవచనాలను ద్రాక్షారామకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కొంపెల్ల భరణి రాజ్‌కుమార్ శర్మ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు, ఆలయ వేద పండితులు బులుసు రామకృష్ణ, పుట్టగుంట సతీష్‌కుమార్, ఇంద్రగంటి రామారావు, మైలవరపు నారాయణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కుంగ్ ఫూ బెల్టు టెస్టుల్లో విద్యార్థుల ప్రతిభ



బెల్టులు గెలుపొందిన విద్యార్థులతో రాజుబాబు

మండపేట: న్యూ డ్రాగన్ చైనీస్ కుంగ్‌ఫూ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఫౌండర్, గ్రాండ్ మాస్టర్ పిట్టా రాజుబాబు ఆధ్వర్యంలో శనివారం మండపేటలో బెల్ట్ టెస్టు పోటీలు జరిగాయి. విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి బెల్టులను కైవసం చేసుకున్నారు. డి నవ్య విజయలక్ష్మి బ్రౌన్ బెల్ట్ సాధించగా, పి హనీత్ పర్పుల్ బెల్ట్, ఆర్ఎస్‌కే భూపతి, పీజే నాగ ప్రదీప్, ఎం. అభిషేక్ పాల్ బ్లూ బెల్ట్‌లు దక్కించుకున్నారు. జి మణికంఠ, పి సాయి గ్రీన్‌బెల్ట్, పి. రిషిత్, ఎం. యశ్వంత్‌లు ఆరెంజ్ బెల్ట్, ఎ చరణ్, జి సిద్ధూ, బి సాత్విక్, జి. చెర్విక్‌లు ఎల్లో బెల్ట్‌లు గెలుపొందారు. వారిని గ్రాండ్ మాస్టర్ పిట్టా రాజుబాబు అభినందించి బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 9న ఎస్ఎం కుంగ్‌ఫూ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ సెల్ఫ్ డిఫెన్స్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో జరిగే ఫస్ట్ నేషనల్ లెవెల్ కుంగ్‌ఫూ - కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

మండపేట: పెంచిన విద్యుత్ చార్జీలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ చార్జీల పెంపుతో పేద వర్గాల వారు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు

మండపేట: పట్టణంలో ఆదివారం వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు జరగనున్నాయి. ప్రముఖ పారిశ్రామికవేత్త నేమాని కృష్ణ రాజశేఖర్ ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన పట్టణ ప్రముఖుడు మేకా శ్రీనివాస్‌తో పాటు పెద్ద ఎత్తున ఆయన అనుచరులు ఎమ్మెల్సీ తోట సమక్షంలో పార్టీలోకి చేరనున్నారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు తీన్‌మార్‌లు, పెద్ద ఎత్తున బాణసంచా కాల్పులతో మారేడుబాక వంతెన వద్ద నుంచి కేపీ రోడ్డు, కలువపువ్వు సెంటర్, బస్టాండు సెంటర్‌లోని సూర్య ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీని ఏర్పాటు చేశారు. అనంతరం సూర్య ఫంక్షన్ హాల్లో జరిగే బహిరంగ సభలో ఎమ్మెల్సీ తోట ఆధ్వర్యంలో భారీ అనుచర గణంతో మేకా శ్రీనివాస్ పార్టీలో చేరనున్నారు.





నూకాలమ్మ ఆలయానికి శంకుస్థాపన



వెలంపాలెంలో నూకాలమ్మ ఆలయ శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెంలో వేంచేసిన నూకాలమ్మ అమ్మవారికి నిర్మించనున్న నూతన ఆలయానికి శనివారం గ్రామ సర్పంచ్, ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ టేకుమూడి సుజాత, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ దంపతుల చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఆయన తనయుడు నరేన్, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, పీఏసీఎస్ ఛైర్మన్ పలివెల నాగరాజు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ దామిశెట్టి గంగాపురుషోత్తం, నియోజక వర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, సర్పంచ్‌లు అంబటి తుకారం, పిల్లి సూర్యప్రకాశరావు, కొత్తపల్లి అరుణ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నల్లూరు సొసైటీ ఛైర్మన్‌గా 'వల్లూరి' ప్రమాణ స్వీకారం

కపిలేశ్వరపురం: సహకార రంగాన్ని బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. నల్లూరు వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక సహకార సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఛైర్మన్‌గా వల్లూరి సూర్య వెంకట కృష్ణారావు (అబ్బు), సభ్యులుగా కూరాటి జ్ఞానవతి, వనుం వెంకటరమణ ప్రమాణం చేశారు. నల్లూరు, వెదురుమూడి గ్రామాల సంఘం సభ్యులు, రైతులకు పూర్తి తోడ్పాటు అందిస్తామని ఛైర్మన్ చెప్పారు. సర్పంచ్ కరుపూడి ఉదయశ్రీ , మండపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, మండల సాగు సలహా మండలి ఛైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, సభ్యులు నక్కా సింహాచలం, ఉప సర్పంచ్ మార్ని పూసబ్బు, చేనేత సహకార సంఘం ఛైర్మన్ సిద్ధాని సూరిబాబు, మాజీ ఛైర్మన్ అతికెల శంభులింగం పాల్గొన్నారు.

సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 అమలు

రామచంద్రపురం: రామచంద్రపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఈనెల 10 నుంచి 30వ తేదీ వరకు సెక్షన్ 30 ప్రకారం నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని రామచంద్రపురం, ద్రాక్షారామ, పామర్రు, మండపేట టౌన్, మండపేట రూరల్, రాయవరం, అంగర పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఈ సెక్షన్ వర్తిస్తుందని తెలిపారు. సెక్షన్ 30 యాక్టు ఉత్తర్వుల ప్రకారం అనుమతి లేకుండా సభలు సమావేశాలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీలులేదని, అటువంటివి జరపాలంటే ముందుగా అనుమంతి పొందాల్సి ఉంటుందన్నారు. ఈ నిషేధాజ్ఞలు ఈనెల 30 వరకు అమలులో ఉంటుందని, సబ్ డివిజన్ పరిధిలో అందరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న ఈ చర్యలకు సహకరించాలని కోరారు. ఈ నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ పేర్కొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీని విజయవంతం చేయండి

కాజులూరు: శలపాకలో ఆదివారం జరగనున్న జగనన్న ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని పార్టీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు అన్నారు. శనివారం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నవరత్నాలు పేదలకు ఇళ్లు పథకంలో భాగంగా గొల్లపాలెం, శలపాక, తణుకువాడ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మండలంలోని శలపాకలో లే అవుట్ వేసి ప్రభుత్వం ఇళ్ల స్థలాలను కేటాయించారన్నారు. రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు ఇళ్ల స్థల పట్టాలు లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. లబ్ధిదారులు, మండల గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.







